పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు వేగవంతం చేయాలి

- నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు జరగాలి
- బడి ఈడు పిల్లలు విధిగా పాఠశాలల్లో ఉండాలి
- అధికారులకు కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశం

-వార్త 6వ పేజీలో...

గిరి విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా

- ఆశ్రమాల్లో హెల్త్ సిబ్బందిని నియమిస్తామని మంత్రి సంధ్యారాణి హామీ
- 2021లో ఆశ్రమాల్లో వైద్య సిబ్బందిని తొలగించిన వైసీపీ సర్కారు
- కనీస ఆరోగ్య పరీక్షలకు నోచుకోని గిరిజన విద్యార్థులు
- విద్యార్థులకు అనారోగ్య సమస్యలు, ఆపై మరణాలు
- కూటమి ప్రభుత్వం రాకతో విద్యార్థుల ఆరోగ్య సమస్యలకు చెక్



డుంబ్రిగుడ మండలం జామిగుడ ఆశ్రమ పాఠశాల

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణకు భరోసా లభించింది. ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని నియమిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తాజాగా ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆశ్రమ విద్యార్థుల ఆరోగ్యంపై పూర్తి నిర్లక్ష్యం చూపగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైద్య సిబ్బందిని నియమిస్తామనడం శుభ పరిణామమని విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

గతంలో ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లుండేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక 2020లో వారిని అకారణంగా తొలగించింది. దీంతో ఆశ్రమ విద్యార్థులకు ప్రాథమిక వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో గిరిజన విద్యార్థులు అనారోగ్యానికి గురికావడం, సకాలంలో వైద్య సేవలు అందక మృతి చెందిన ఘటనలున్నాయి. కానీ వైసీపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ప్రతి ఏడాది పదుల సంఖ్యలో విద్యార్థులు రోగాల బారినపడడం, పరిస్థితులు విషమించి మృతి చెందడం సర్వసాధారణమైపోయింది.

ఏజెన్సీ 11 మండలాల్లో 121 గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలున్నాయి. వాటిలో 38 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. విద్యా సంవత్సరంలో సెలవులు మినహా వారంతా ఆశ్రమ పాఠశాలల్లోనే ఉంటారు. కాగా 2014, 2015 సంవత్సరాల్లో అనారోగ్య సమస్యలతో పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థులు మృతి చెందారు. దీంతో ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్ పేరిట వైద్య సిబ్బందిని నియమించాలనే డిమాండ్ ఉత్పన్నమైంది. దీనికి స్పందించిన గిరిజన సంక్షేమ శాఖ 121 ఆశ్రమాలకు 2016లో 72 మంది హెల్త్ అసిస్టెంట్‌లను, 49 మంది ఏఎన్‌ఎంలను నియమించారు. దీంతో ఆశ్రమాల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, అవసరం మేరకు సమీపంలోని ఆస్పత్రికి తీసుకు వెళ్లి వైద్యం అందించడం చేసేశారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యానికి ఒక భరోసా ఉండేది.

కొవిడ్ తరువాత వైద్య సిబ్బంది నియామకాల్లేవు

2016 నుంచి ఆశ్రమాల్లో పని చేస్తున్న ఆరోగ్య సిబ్బందిని కొవిడ్ తరువాత పాఠశాలల పునఃప్రారంభంలో నియమించకుండా తొలగించారు. కొవిడ్ కారణంగా 2019, 2020లో విద్యాలయాలు మూతపడడం, 2021లో పాఠశాలలు తెరచుకున్నప్పటికీ ఆశ్రమాల్లో హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంల నియామకానికి వైసీపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇన్నాళ్లూ పని చేస్తున్న వారిని తొలగించినట్లేనని ప్రకటించారు. దీంతో స్థానిక అధికారులు సైతం ఏమీ చేయలేక మిన్నకున్నారు. అలాగే 2021లో పాఠశాలలు అంతంతమాత్రంగా తెరచుకోవడం, 2022 విద్యా సంవత్సరం జూలై ఐదో తేదీ నుంచి ప్రారంభమైనప్పటికీ ఆశ్రమాల్లోని విద్యార్థుల ఆరోగ్య రక్షణ సందిగ్ధంలో పడింది. అలాగే అప్పుడప్పుడు విద్యార్థులు రోగాల బారినపడడంతో ఉపాధ్యాయులే ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు. పరిస్థితి విషమిస్తే విద్యార్థులు తమ ప్రాణాలు కోల్పోయేవారు.



విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

మొక్కుబడిగా స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఉద్దేశించిన స్కూల్ హెల్త్ కార్యక్రమం ఏజెన్సీలో ... మిగతా 6వ పేజీలో

ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బందిని నియమిస్తాం



వైసీపీ పాలనలో గిరిజన విద్యార్థులకు కనీస వైద్య సేవలు అందక అనారోగ్యంతో మృతి చెందిన ఘటనలను ఎన్నో చూశాం. అటువంటి ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రతి ఆశ్రమ పాఠశాలకు వైద్య సిబ్బందిని నియమించి, విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. ఇన్నాళ్లూ గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం కొనసాగింది. దీంతో ఆయా సమస్యలను అధిగమించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతాం. భవిష్యత్తులో విద్యార్థుల మరణాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేస్తాం.

-గుమ్మడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.విజయసునీత, పక్కన అరకులోయ ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం

సికిల్ సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యం

కలెక్టర్ ఎం.విజయసునీత



సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

పాడేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యమని కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనరిక వివాహాలు, వంశపారపర్యంగా సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదని, జన్యుపరమైన వ్యాధి అని, శరీరంలో రోగ నిరోధకశక్తి తగ్గి ఆక్సిజన్ స్థాయిలు క్షీణిస్తాయన్నారు. ప్రధానంగా రక్తహీనత లోపిస్తుందన్నారు. 2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియాను పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయని తెలిపారు.

మహిళలు సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గిరిజనులను చైతన్య పరచాలని సూచించారు. మేనరిక వివాహాలు చేసుకోవద్దని కలెక్టర్ హితవు పలికారు. అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియాను అవగాహనతోనే నిర్మూలించవచ్చన్నారు. 40 ఏళ్ల లోపు వారందరికీ ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో 6 లక్షల 76 వేల మంది జనాభా ఉన్నారన్నారు. వారిలో 3.5 శాతం మంది 40 ఏళ్ల లోపు వయస్సు వారున్నారన్నారు. ఇప్పటి వరకు 1.76 లక్షల మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేశామని, 2,300 మందికి సికిల్‌సెల్ ఎనీమియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ప్రతి నెలా మందులు, రూ.10 వేలు పింఛన్ అందిస్తున్నట్టు తెలిపారు. 2026 నాటికి శతశాతం స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కృష్ణారావు సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించారు.

అంతకు ముందు అంబేడ్కర్ కూడలి నుంచి తలారిసింగిలో అంబేడ్కర్ ఇండోర్ స్టేడియం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఐ.కొండలరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ పి.అనుదీప్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

గిరిజన యువకుడి అనుమానాస్పద మృతి

స్నేహితులతో పందెం..

ఈ క్రమంలోనే బావిలో దిగి దుర్మరణం!



గంగపూజారి అశోక్ (ఫైల్)

పాడేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాడేరు గ్రామంలో బుధవారం ఓ గిరిజన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కొత్త పాడేరుకు చెందిన గంగపూజారి అశోక్(25), మరో నలుగురు స్నేహితులతో కలిసి బుధవారం గ్రామానికి సమీపంలో ఉన్న బావి వద్ద మద్యం, గంజాయి సేవించారు. ఈ క్రమంలోనే బావిలో ఈత కొట్టడడంపై పందేలు వేసుకున్నారు. ఈ క్రమంలో స్నేహితులు అశోక్‌కు చెందిన సెల్‌ను బావిలో పడేసి, దానిని తీయమని వారంతా అశోక్‌తో పందెం కాశారు. రెండు మార్లు బావిలో పడేసిన సెల్‌ను తీసిన అశోక్ మూడోసారి మునిగి మృతి చెందాడు. అశోక్ మద్యం, గంజాయి సేవించడం వల్లే మూడోసారి బావిలో ఈతకొట్టే సమయంలో మునిగిపోయాడని స్థానికులు అంటున్నారు. బావిలో దిగి అశోక్ మృతి చెందిన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలోంచి వెలికి తీశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అశోక్ మృతదేహానికి బుధవారం స్థానిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అశోక్ మృతికి కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కొత్తపాడేరు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాధుల విజృంభణ

ఏరియా ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి





ఓపీ కోసం బారులుతీరిన రోగులు, (ఇన్‌సెట్లో) చికిత్స కోసం ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న రోగులు

చింతపల్లి, జూన్ 19: వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి భారీగా పెరిగింది. బుధవారం ఒక్క రోజే 350 మంది రోగులు చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చారు. దీంతో ఓపీ వద్ద రోగులు బారులు తీరాల్సి వచ్చింది.

స్థానిక ఏరియా ఆస్పత్రికి చింతపల్లి, జీకేవీధి మండలాల నుంచి రోగులు వస్తుంటారు. సాధారణంగా ఆస్పత్రిలో ప్రతి రోజు 200 నుంచి 250 ఓపీ వస్తుంది. ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ కావడంతో ఈ సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం వైరల్, మలేరియా జ్వరాలతో పాటు ఇతర వ్యాధులతో రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. జ్వర బాధితులు అధికంగా ఆస్పత్రికి వస్తుండడంతో వార్డులు నిండిపోయాయి. ప్రతి రోజు వార్డులో 50 మందికి పైగా రోగులు ఉంటున్నారు. రోగులతో పాటు ప్రసవం కోసం వచ్చే గర్భిణుల సంఖ్య అధికంగా ఉన్నది. దీంతో ఆస్పత్రి కిటకిటలాడుతున్నది. ఏరియా ఆస్పత్రి నిర్వహిస్తున్న భవనం సుమారు 20 ఏళ్ల కిందట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో నిర్మించినది కావడంతో రోగులకు వసతి సమస్య అధికంగా ... మిగతా 6వ పేజీలో

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

డైట్ చార్ట్ పాటించని కేజీహెచ్ కాంట్రాక్టర్

- ప్రతి రోజూ టిఫిన్‌గా జావ లాంటి ఉప్మాయే
- భోజనం రుచి కూడా అంతంత మాత్రమే
- వైసీపీ నేత మనుషులకు కాంట్రాక్టు
- నాణ్యతపై ఫిర్యాదులు ఉన్నా పట్టించుకోని అధికారులు



రోగులకు అల్పాహారం వడ్డిస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్‌లో) ప్లేటులో పల్చగా ఉన్న ఉప్మా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ప్రజలకు పెద్ద దిక్కు అయిన కింగ్‌జార్జి ఆస్పత్రిలో రోగుల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి పౌష్టికాహారం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నాయి. వాటిని కాజేయడానికి రాయలసీమ వైసీపీ నేతలు విశాఖలో పాగా వేశారు. ఆ పార్టీ పేరు 'చెవి'న పడగానే ఎటువంటి కాంట్రాక్ట్ అయినా సంతకం చేసేసే అధికారి...దీనిని కూడా అలాగే ఇచ్చేశారు. దాంతో రోగులకు సరైన ఆహారం అందడం లేదు.

కింగ్ జార్జి ఆస్పత్రిలో రోజుకు 1,600 నుంచి 1,800 రోగులకు ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజనం అందిస్తారు. డాక్టర్లు, పీజీలకు కూడా ఇక్కడే మధ్యాహ్నం భోజనం పెడతారు. వీరు 200 మంది వరకు ఉంటారు. అంటే కేజీహెచ్‌లో రోజుకు రెండు వేల మందికి ఆహారం పెడతారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనంలో ఏమి పెట్టాలనేది వైద్యాధికారులు ఒక చార్ట్ (మెనూ) తయారు చేశారు. ఆ ప్రకారం ఏ రోజుకు ఆరోజు ఆహారం మారుస్తూ పెట్టాలి. సాధారణ వార్డులో ఉన్న ఒక్కో రోగికి ఆహారం నిమిత్తం ప్రభుత్వం రోజుకు రూ.80 ఇస్తోంది. అదే మహిళలు ఉండే వార్డు (గర్భిణులు, పురుడు పోసుకున్న తల్లులు)లకైతే రోజుకు రూ.100 ఇస్తారు. జననీ శిశు సురక్ష పథకం కింద ఈ నిధులు ... మిగతా 6వ పేజీలో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

ఐదుగురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ డీఈవో సీరియస్

అరకులోయ, జూన్ 19: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు గుర్తించారు. దీంతో ఉపాధ్యాయులు కె.అప్పలరాజు, ఎం.మాణిక్యమ్మ, బి.కృష్ణవేణి, హెచ్‌బీ శ్రీనివాసరావు, ఎన్.అప్పన్నలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



బుధవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న పాడేరు-అరకులోయ జాతీయ రహదారి

మండుతున్న ఎండలు

ఉక్కపోతతో జనం విలవిల

పాడేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండలు మండుతున్నాయి. గత రెండు రోజులు ఎండల తీవ్రత పెరుగుతున్నది. దీంతో బుధవారం జి.మాడుగులలో 31.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో సైతం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతున్నది. మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై సంచరించేందుకు జనం, వాహన చోదకులు సైతం ఇబ్బంది పడుతున్నారు. దీంతో మధ్యాహ్నం సమయాల్లో ప్రధాన రోడ్లు సైతం నిర్మానుష్యంగానే ఉంటున్నాయి. తాజా వేడి వాతావరణానికి ఏజెన్సీ వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాస్తవానికి ఇటీవల కాలంలో నైరుతి రుతుపవనాల ప్రభావంలో వర్షాలు కురుస్తుండడంతో ఎండ ప్రభావం తగ్గి వాతావరణం కాస్త చల్లబడింది. అయితే నైరుతి ప్రభావం తగ్గడంతో గత రెండు రోజులుగా ఎండ ప్రభావం తీవ్రమైంది.

శరవేగంగా సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు డిజైన్

- ఒక్కోటి 150 మెగావాట్ల సామర్థ్యం గల 9 యూనిట్లకు రూపకల్పన
- పూర్తిగా భూగర్భంలో నిర్మాణం
- ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి

-వార్త 6వ పేజీలో..

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

చింతపల్లి, జూన్ 19: నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలోని పెద్దగెడ్డ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన విద్యార్థిని మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పులి గొంది గ్రామంలో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడిన గిరిజన మహిళ స్వప్న అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గంధాలవీధి గ్రామానికి చెందిన మర్రి లోవకుమారి (17), మరో యువకుడు సిందెరి చందు కలిసి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పెద్దగెడ్డ వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ (పశుసంచార వాహనం), ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న లోవకుమారి రహదారిపై పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. లోవకుమారి అరకులోయ గిరిజన సంక్షేమ శాఖ బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతున్నది. కాగా వాహనం నడుపుతున్న చందుకు ఎటువంటి గాయాలు తగలలేదు.

36 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

జి.మాడుగుల, జూన్ 19: మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బంద వీధి కూడలి వద్ద బుధవారం 36 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వాహనాలు తనిఖీలు చేస్తుండగా అటు నుంచి వస్తున్నవ్యాన్‌లో రెండు గోనె సంచుల్లో 36 కిలోల ఎండు గంజాయిని గుర్తించామన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌ను సీజ్ చేసి, అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన గోకాడ వరహామూర్తి, డోకాల అప్పా రావు, పెదలోచలి పంచాయతీకి చెందిన కోడ రామకృష్ణను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

పవన్‌కల్యాణ్‌కు పంచకర్ల అభినందనలు



పవన్‌తో పంచకర్ల

పెందుర్తి, జూన్ 19 : ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూచే చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

అయ్యన్నపై అభిమానం... అప్పన్నపై భక్తితో పాదయాత్ర



అప్పన్న ఆలయంలో నాతవరం నుంచి వచ్చిన టీడీపీ అభిమానులు

సింహాచలం, జూన్ 19 : ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం వరాహలక్ష్మీనృసింహ స్వామిపై అచంచల భక్తి, తమ నాయకుడు అయ్యన్నపాత్రుడిపై వల్లమాలిన అభిమానంతో నాతవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు సింహగిరికి పాదయాత్రగా చేరుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన వీరాభిమానులు సుమారు 30 మంది ఈనెల 17న ఉదయం తమ గ్రామం నుంచి పాదయాత్రగా బుధవారం సాయంత్రం సింహగిరికి చేరుకున్నారు. వారంతా వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమ స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు.

రామ్మోహన్‌నాయుడు దృష్టికి సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలు



కేంద్ర మంత్రికి రామ్మోహన్‌నాయుడుకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు

విశాఖపట్నం, జూన్ 19: తెలుగుదేశం పార్టీ నాయకుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఉత్తరాంధ్ర గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం వార్డు సచివాలయ అడ్మిన్ స్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను కేంద్ర మంత్రికి విన్నవించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా రామోహన్‌నాయుడు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. సచివాలయ వ్యవస్థపై కమిటీ వేసి వచ్చిన నివేదిక మేరకు సమీక్ష జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, స్టేట్ జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెంకట గణేష్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

క్రిష్ణమయ్య చరిత్రను తెరకెక్కిస్తా

» సినీ దర్శకుడు వి.సముద్ర



సినీ దర్శకులు వి సముద్ర

సింహాచలం, జూన్ 19: వరాహలక్ష్మీనృసింహస్వామిపై తెలుగులో నాలుగున్నర లక్షలకుపైగా వచన సంకీర్తనలు రాసి, స్వయంగా బాణీలు సమకూర్చి ఆలపించిన తొలి తెలుగు వచన సంకీర్తనాచార్యులు కాంతా కృష్ణమాచార్యులు (క్రిష్ణమయ్య) చరిత్రను ప్రజలందరికీ చేరువ చేస్తానని ప్రముఖ సినీ దర్శకుడు వి.సముద్ర తెలిపారు. ఈ మేరకు క్రిష్ణమయ్యపై సినిమా తీయాలని నిర్ణయించుకున్నానన్నారు. అడివివరం పైడితల్లమ్మ మహోత్సవంలో తెలగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు సారథ్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రిష్ణమయ్య వచన సంకీర్తనల ద్వారా సింహాద్రినాథుని మెప్పుపొందడంతోపాటు నాటి సాంఘిక దురాచారాలపై పోరాటం చేసిన మహనీయుడు అన్నారు. ఆయన చరిత్ర ద్వారా సింహాద్రి అప్పన్న మహిమలను చాటిచెప్పేందుకు వీలుంటుందని, వెంకన్నకు అన్నమయ్య లా అప్పన్నకు క్రిష్ణమయ్య అంతటి వాడేనని చెప్పడమే ఉద్దేశమన్నారు. క్రిష్ణమయ్య జీవిత చరిత్ర, సంకీర్తనలు సమగ్రంగా పండితులు, గ్రంథాలయాల నుంచి సేకరించే పని ప్రారంభించామన్నారు. ఇందులో స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్, తదితరులు సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

సమస్యల 'పాలవెల్లి'

పదేళ్లుగా అంధకారంలోనే కోనాం జలాశయం

- » రూ.40 లక్షలకు పైగా విద్యుత్ బకాయి
- » పని చేయని దిగువ కాలువల గేట్ల డోర్లు
- » 30 క్యూసెక్కుల నీరు లీకేజీ రూపంలో వృథా
- » సిబ్బంది కొరత.. నైట్ వాచ్‌మన్‌తో కాలయాపన
- » ఏటా ఎగువ కాలువ రైతులకు సాగునీటికి కటకట



బురదమయంగా ఉన్న కోనాం జలాశయం గట్టు



జలాశయం వద్ద విధులు నిర్వహిస్తున్న ఒకే ఒక ఉద్యోగి షేక్ రసూల్

చీడికాడ, జూన్ 19 : మండలంలోని కోనాంలో నిర్మించిన పాలవెల్లి జలాశయం గత పది సంవత్సరాలకు పైగా సమస్యలతో కొట్టుమిట్టాడు తోంది. చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, దేవరాపల్లి మండలాల్లో సుమారు 14 వేల 500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 1977-80లో దీన్ని నిర్మించారు. ఈ జలాశయానికి శిరిజాం, మర్లగుమ్మి, మంగళాపురం హైలెవెల్ చానల్ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ఈ చానల్‌కు సాగునీరు అందించేందుకు దిగువ



తుప్పల మధ్యలో ఉన్న విశ్రాంతి భవనం

కాలువకు మూడు గేట్లు, ఎగువ కాలువకు ఒక గేటు ఏర్పాటు చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా 92 మీటర్లు వచ్చేసరికి హైలెవెల్ కాలువకు సాగునీరు నిలిచిపోతుంది. అదే దిగువ మూడు ఆనకట్టలకు 87 మీటర్ల వరకూ సాగునీరు పారుతుంది. అయితే జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి ప్రతిరోజు 30 క్యూసెక్కులకు పైగా సాగునీరు వస్తున్నా దిగువ కాలువగేట్లు జీరు శిథిలావస్థలో ఉండటంతో ప్రతిరోజు 30 క్యూసెక్కులకు పైగా సాగునీరు వృథాగా లీకేజీ రూపంలో కాలువలోకి పోతోంది. జలాశయం నిర్మాణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సదుపాయం సజావుగా సాగుతున్నప్పటికీ, పదేళ్ల క్రితం వరకూ రూ.40 లక్షల వరకూ బిల్లులు కట్టకపోవడంతో ఆ వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో పదేళ్ల నుంచి జలాశయం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. వర్షాకాలం నాలుగు నెలలు జనరేటర్ సహాయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ఈ జలాశయం వద్ద నీటి పారుదలశాఖ ఏఈ మినహా మరో ఎనిమిది మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం ఒక నైట్‌వాచ్‌మన్ మాత్రమే ఉన్నాడు. అతడు జలాశయం వద్దనే నివాసం ఉంటూ తప్పని పరిస్థితుల్లో రాత్రి, పగలు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నాడు. జలాశయం గరిష్ఠ స్థాయికి చేరినపుడల్లా నైట్‌వాచ్‌మన్ ఎన్నో ఇబ్బందులు పడుతుంటాడు. ఎగువ కాలువ గేట్లు నుంచి దిగువ కాలువ గేట్లు వరకూ



దిగువ ఉన్న కాలువ గేట్లు ద్వారా వృథాగా పోతున్న సాగునీరు

జలాశయం ప్రధాన గట్టు మట్టిది కావడంతో ఓ మోస్తరు చినుకులు పడినా బురదకుంటలా తయారవుతుంది.

శిథిలావస్థలో సిబ్బంది క్వార్టర్స్

జలాశయం నిర్మాణంలో నియమించిన సిబ్బంది వసతిగృహాలు శిథిలావసకు చేరాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినపుడు విశ్రాంతి తీసుకునేందుకు నిర్మించిన భవనాన్ని సైతం పట్టించుకోకపోవడంతో తుప్పలు, డొంకల మధ్య శిథిలావస్థకు చేరుకుంది. ఈ సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేయడంతో సమస్యలు పేరుకుపోయాయని రైతులు, రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వంలో గెలిచిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై ఏఈ సీహెచ్ జయరామ్ వద్ద ప్రస్తావించగా.. గతంలో ఎన్నోసార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మరోసారి ఈ ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళతామని తెలిపారు.



పూర్తిగా శిథిలమైన సిబ్బంది వసతిగృహాలు

శిరీషకు రాష్ట్ర స్థాయి యువ శాస్త్రవేత్త అవార్డు



గవర్నర్ నజీర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న శిరీష

దేవరాపల్లి, జూన్ 19 : మండలంలోని మారేపల్లికి చెందిన అవుగడ్డ శిరీష రాష్ట్ర స్థాయి ఉత్తమ యువ శాస్త్రవేత్త పురస్కారంతో పాటు స్వర్ణ పతకం దక్కించుకుంది. బాపట్లలోని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన 56వ స్నాతకోత్సవం (కాన్వొకేషన్) ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్లా నజీర్ చేతుల మీదుగా, ఐకార్ (ఐసీఏఆర్)డైరెక్టర్ జనరల్ (న్యూఢిల్లీ)డా.హిమన్షు పాటక్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారదా జయలక్ష్మి సమక్షంలో పురస్కారాన్ని ఆమె స్వీకరించారు. ఈమె ప్రస్తుతం ఎలమంచిలిలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు.

రెండో దశ వ్యవసాయ గణనపై శిక్షణ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న అర్థగణాంక శాఖ ఉప సంచాలకురాలు సౌజన్య

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 19: రెండో దశ వ్యవసాయ గణనను పారదర్శకంగా నిర్వహించాలని అర్థగణాంక శాఖ ఉప సంచాలకురాలు కె. సౌజన్య అధికారులను ఆదేశించారు. 2021, 2022 సంవత్సరాలను ప్రామాణికంగా తీసుకుని కమతాల వారీగా, పంటల వారీగా సాగు వివరాలు నమోదు చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో దశ వ్యవసాయ గణనకు సంబంధించి జిల్లాస్థాయి శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ వ్యవసాయ గణనలో మండల సహాయ గణాంక అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. ముందుగా వ్యవసాయ గణనను నిర్వహించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక విభాగం అధికారి రామారావు, గణాంక అధికారి ఎం.శ్రీరామ్మూర్తి, సహాయ గణాంక అధికారులు పాల్గొన్నారు.

29న చోడవరంలో జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

విశాఖపట్నం (లీగల్), జూన్ 19 : చోడవరం కోర్టులో ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ తెలిపారు. చోడవరం కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, రాజీకి యోగ్యత కలిగిన కేసులు, సివిల్, క్రిమినల్, మోటారు వాహన ప్రమాదాలకు సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. గంజాయికి సంబంధించిన కేసుల ఆస్తులు కోర్టుకు చేరడంలేదని వీటి విచారణ వేగవంతం చేయాలని అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ భాస్కరన్‌కు సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిషన్ కమ్ సబ్‌జడ్జి ఇ.రాజేంద్ర మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో జాప్యం జరిగితే న్యాయవాదులు, కక్షిదారులు తనను నేరుగా కలవాలని సూచించారు. ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి జి.స్వర్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ తదితరులు మాట్లాడారు.

ప్రాణం నిలవాలంటే పరుగు తీయాల్సిందే!!

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కింగ్‌జార్జి ఆస్పత్రి (కేజీహెచ్)లో రోగుల బాధలు అన్నీ ఇన్నీ కావు. దిగువ స్థాయి సిబ్బంది ప్రతి పనికీ లంచాలు ఆశించి, ఎవరైనా అడిగిన మొత్తం ఇవ్వకపోతే...విధుల నిర్వహణకు ముందుకు రారు. దాంతో చాలామంది రోగుల వెంట వచ్చేవారు తామే ఆ పనులు చేసుకుంటూ ఉంటారు. అర్జెంట్‌గా ఎవరైనా రోగిని ఒక వార్డు నుంచి మరో వార్డుకు తీసుకువెళ్లాలంటే వీల్ ఛైర్ లేదా స్ట్రెచర్ అవసరం అవుతాయి. వాటిని తీసుకువచ్చి, రోగిని తరలించేవారి చేతిలో ఎంతో కొంత పెట్టకపోతే వారు ఆ పనిచేయరు. డబ్బులు ఇవ్వలేని వారు తామే భుజాలపై వేసుకునో, వీల్ చైర్ తీసుకునో వెళతారు. అలాంటి ఘటనే ఒకటి మంగళవారం కేజీహెచ్‌లో జరిగింది. కాకినాడ జిల్లా కోటనందూరుకు చెందిన శిరీష నెలలు నిండకుండానే కేజీహెచ్‌లో మంగళవారం ప్రసవించింది. బిడ్డ ఆరోగ్యం బాగా లేకపోవడంతో నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు తరలించాలని వైద్యులు నిర్ణయించారు. అక్కడికి వెళ్లేంత వరకు బిడ్డకు ఆక్సిజన్ ఉండాలని, సిలిండర్ అమర్చారు. బిడ్డతో పాటు దానిని కూడా అక్కడికి తీసుకువెళ్లాల్సి ఉంది. సాయం చేసేవారు ఎవరూ లేకపోవడంతో బిడ్డ తండ్రి విష్ణుమూర్తి తానే ఆ సిలెండర్ మోసుకొని వస్తానని, వైద్యులకు చెప్పి బిడ్డతో పాటు వెళ్లాడు. దానిని కొందరు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బాగా వైరల్ అయింది. దాంతో ఉన్నతాధికారులు ఘటనపై ఆరా తీశారు. మరోసారి అలా జరగకుండా బ్యాటరీ వాహనాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు.

» కేజీహెచ్‌లో రోగుల పాట్లు



నర్సు వెనుక ఆక్సిజన్ సిలెండర్‌తో వెళుతున్న తండ్రి

పది హెక్టార్లలో టేకు ప్లాంటేషన్ సాగు

» ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రవుఫ్



టేకు ప్లాంటేషన్ పనులు పరిశీలిస్తున్న ట్రైనీ డీఎఫ్‌వో రౌఫ్

గొలుగొండ, జూన్ 19 : అచ్చియ్యపేట వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న టేకు ప్లాంటేషన్‌లో చేపడుతున్న పనులను ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రౌఫ్ బుధవారం పరిశీలించారు. మండలంలోని పాతమల్లంపేట గ్రామపంచాయతీలో శివారు అచ్చియ్యపేటలో గల అటవీ ప్రాంతంలో సుమారు పది హెక్టార్లులో టేకు ప్లాంటేషన్ ఏర్పాటుకు తుప్పలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. దీన్ని నర్సీపట్నం ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రౌఫ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రౌఫ్ విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఏడాది పది హెక్టార్లులో టేకు ప్లాంటేషన్ నాటేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. త్వరితగతిన తుప్పలు తొలగించే కార్యక్రమం అటవీ సిబ్బంది చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెలాఖరులోగా టేకు మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్, వెంకట్రావు, ఎఫ్‌బీవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో శిలాఫలకం ధ్వంసం

ఆందోళన చేపట్టిన వైసీపీ నాయకులు



ధ్వంసమైన శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

తుమ్మపాల, జూన్ 19 : మండలంలోని తుమ్మపాలలో అభివృద్ధి పనులకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. దీంతో వైసీపీ నాయకులు బుధవారం కొద్దిసేపు సదరు ప్రాంతంలో నిరసన తెలిపి పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ తుమ్మపాల వీధిలో రూ. 11లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేయగా, ఫిబ్రవరిలో అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం దారుణమని వాపోయారు. పోలీసులు విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు

'పంట కాలువల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి'

చీడికాడ, జూన్ 19 : రైతుల పొలాల్లో పంట కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీడీ బండారు శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఉపాధి పథకం వీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట కాలువల నిర్మాణంలో ఇంతవరకూ ఆరుశాతం మాత్రమే పనులు చేశారని మిగతా పనులు కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నదృష్ట్యా ఈ ఏడాది పండ్లతోటల పెంపకానికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని కోరారు.

ఆస్తి పన్ను చెల్లింపునకు తంటాలు

- » వార్డు సచివాలయాల్లో పనిచేయని సీడీఎంఏ వెబ్‌సైట్
- » మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లింపునకు ఈ నెలాఖరు వరకూ గడువు
- » ఆ తరువాత నెలకు నూటికి రూ.2 వడ్డీ విధింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సీడీఎంఏ వెబ్‌సైట్ చుక్కలు చూపిస్తోంది. వార్డు సచివాలయాల్లో పన్ను చెల్లించేందుకు వెళ్లిన వారికి సర్వర్ డౌన్ అంటూ అక్కడి సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో వారంతా చేసేదేమీలేక వెనుతిరిగి వెళ్లిపోతున్నారు.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం నివాస, నివాసేతర భవనాలతోపాటు ఖాళీ స్థలాలకు సంబంధించి 5,72,356 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.450 కోట్లు పన్ను వసూలవుతుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.456 కోట్లు వసూలైంది. సాధారణంగా ఆస్తి పన్నును రెండు విడతలుగా (అర్ధ సంవత్సరాలు) విభజించి యజమానుల నుంచి జీవీఎంసీ కట్టించుకుంటుంది. ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకూ మొదటి అర్ధ సంవత్సరంగానూ, అక్టోబర్ ఒకటి నుంచి మార్చి 31 వరకూ రెండో అర్ధసంవత్సరంగా పరిగణిస్తారు. మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును జూన్ 30వ తేదీలోగా చెల్లించేయాల్సి ఉంటుంది. అలాకానిపక్షంలో రూ.2 చొప్పున వడ్డీ అదనంగా చెల్లించాలి. దీంతో చాలామంది పన్ను చెల్లింపుదారులు జూన్‌నెలలోనే తమ మొదటి అర్ధసంవత్సరం పన్నును చెల్లిస్తుంటారు. ఆస్తి పన్ను చెల్లింపు కోసం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో 'సౌకర్యం' కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిల్లో పన్ను చెల్లిస్తే ఆ మొత్తం జీవీఎంసీ ఖజానాకు నేరుగా చేరిపోతుంది. ఇవికాకుండా జీవీఎంసీ పరిధిలోని 573 వార్డు సచివాలయాల్లో కూడా ఆస్తిపన్ను చెల్లించేందుకు గత రెండేళ్లుగా అవకాశం కల్పించారు. తమ ఇంటి సమీపంలోని వార్డు సచివాలయాల్లో ఎక్కువ మంది పన్ను చెల్లించేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే వార్డు సచివాలయాల్లో జీవీఎంసీ వెబ్‌సైట్‌లో కాకుండా సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా పన్ను వసూలు జరుగుతుంది. గత మూడు రోజులుగా సీడీఎంఏ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో వార్డు సచివాలయాల్లో ఆస్తిపన్ను వసూళ్లు నిలిచిపోయాయి. పన్ను చెల్లింపుదారులు అక్కడకు వెళితే సర్వర్ డౌన్‌లో ఉన్నందున పన్ను కట్టించుకునే పరిస్థితి లేదని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో వారంతా వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఈ నెలాఖరులోగా చెల్లించకపోతే వడ్డీ పడిపోతుందని, అది ఎవరు భరిస్తారని కొందరు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

శరవేగంగా పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు టన్నెల్ డిజైన్

» ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి

సీలేరు, జూన్ 19: సీలేరులో నిర్మించతలపెట్టిన 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించిన టన్నెల్ డిజైన్ శరవేగంగా జరుగుతున్నదని ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జెన్‌కో కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్సు పరిధిలోని ఎగువ సీలేరు పార్వతీనగర్ వద్ద ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ నిర్మాణ పనులను గతంలోనే మెగా కంపెనీ టెండర్లను దక్కించుకుందన్నారు. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు ప్రాజెక్టు నిర్మించే స్థలాన్ని పరిశీలించారన్నారు. ఇది పూర్తిగా భూగర్భంలో నిర్మించే ప్రాజెక్టు అన్నారు. మెగా కంపెనీ ఇచ్చిన టన్నెల్ డిజైన్‌ను జెన్‌కో నిపుణులు పరిశీలించి ఆమోదించాల్సి ఉందన్నారు. అనంతరం టన్నెల పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. దీనికి సుమారు ఆరు నెలలు సమయం పడుతుందన్నారు. డిజైన్ రూపకల్పన జరిగేవరకు ఏ పనులు చేపట్టడానికి వీల్లేదని ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు.

నాణ్యమైన కాఫీ దిగుబడుల పెంపునకు కార్యాచరణ

రైతు సాధికారత సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి సెవెరిన్

చింతపల్లి, జూన్ 19: గిరిజన ప్రాంతంలో నాణ్యమైన కాఫీ దిగుబడులు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్టు రైతు సాధికారత సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) మార్కెటింగ్ ప్రతినిధి (విదేశీ శాస్త్రవేత్త) సెవెరిన్ చెప్పారు. మండలంలో రైతు సాధికారత సంస్థ ప్రతినిధులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కోటగున్నలు గ్రామంలో కాఫీ నర్సరీ, తీగలమెట్ట గ్రామంలో కాఫీ తోటలను పరిశీలించారు. అనంతరం సెవెరిన్ మాట్లాడుతూ గిరిజన రైతులు ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడేలా నాణ్యమైన కాఫీని ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఎకరానికి ఉండాల్సిన మొక్కల కంటే తక్కువగా ఉండడంతో అధిక దిగుబడులు పొందలేకపోతున్నారని చెప్పారు. ఎకరానికి 900 మొక్కలు నాటాలని, కలుపు తొలగించుకుని తగినంత నీడ ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఢిల్లీ మార్కెటింగ్ ప్రతినిధి అనూఫ్ మాట్లాడుతూ వచ్చే మూడేళ్లలో ఎకరానికి రెండు టన్నుల కాఫీ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో రైతు సాధికారిత సంస్థ డీపీఎం భాస్కరరావు, కాఫీ ప్రాజెక్టు ఏడీ ఎస్.అశోక్, ఏఈవో ధర్మరాయ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

» జిల్లా కలెక్టర్ విజయసునీత

పాడేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్య, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 130 అంగన్‌వాడీ కేంద్రాలు, 817 పాఠశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే నాడు-నేడు కార్యక్రమాన్ని మౌలిక సదుపాయాల కల్పనగా ప్రభుత్వం పేరును మార్చిందన్నారు. నిర్దేశిత లక్ష్యం మేరకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో పనులు జరగాలన్నారు. జిల్లాలో చింతూరు, పెదబయలు, ఏటపాక, వై.రామవరం, కొయ్యూరు, ముంచంగిపుట్టు మండలాల్లో పనులు మందకొడిగా జరుగుతున్నాయని, వీటిని వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. విద్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సమన్వయంతో ఆయా పనులు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో జిల్లా ప్రస్తుతం 15వ స్థానంలో ఉందని, పనులు వేగవంతం చేసి మరింత ముందుకు తీసుకువెళ్లాలని కలెక్టర్ కోరారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం.విజయసునీత, తదితరులు

'నేను బడికి పోతా' పోస్టర్ ఆవిష్కరణ...

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలనే కార్యక్రమంలో భాగంగా 'నేను బడికి పోతా' పేరిట విద్యా శాఖ రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత ఆవిష్కరించారు. అలాగే బడిఈడు పిల్లలంతా విధిగా పాఠశాలల్లో ఉండేలా మండల విద్యాశాఖాధికారులు, ఏటీడబ్ల్యూవోలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని అధికారులు వర్చ్‌వల్‌గా, స్థానిక ఐటీడీఏ పరిధిలో అధికారులు స్వయంగా హాజరయ్యారు. ఐటీడీఏ పీవో అభిషేక్, డీఈవో బ్రహ్మాజీరావు, టీడబ్ల్యూ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు పాల్గొన్నారు.

విద్య, తాగునీటి సమస్యలపై సభ్యుల ధ్వజం

» వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

అరకులోయ, జూన్ 19: మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. విద్య, తాగునీటి సమస్యలపై సమావేశంలో ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆర్.ఉషారాణి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యుడు శత్రుఘ్న మాట్లాడుతూ పాఠశాలలు తెరచి వారం రోజులు కావస్తున్నా కొన్ని గ్రామాలలో ఉపాధ్యాయులు విధులకు హాజరు కావడం లేదని, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని, ఆశ్రమోన్నత పాఠశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు తిరుగుతున్నా సీట్లు లభించడం లేదని, అలాగే ఆరో తరగతిలో చేరడానికి జనన ధ్రువపత్రం అడగడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆశ్రమోన్నత పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని చెప్పారు. దీనికి ఎంఈవో మోహన్‌రావు వివరణ ఇచ్చారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈఈ వ్యవహార శైలిపై బస్కీ, బొండాం, సుంకరమెట్ట సర్పంచులు పాడి రమేష్, భాస్కరరావు, చినబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్ తదితరులు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం పనుల్లో నాణ్యత లోపించిందని తెలిపారు. ప్రజాప్రతినిధులను గౌరవించలేని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెదలబుడు, పద్మాపురం మేజర్ పంచాయతీల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని జడ్పీటీసీ సభ్యురాలు రోష్నీ అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయిస్తే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులు చేయించలేకపోతున్నారని, మిగిలిన గ్రాంట్లతో మంజూరైన పనులు ఎలా చేయిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. సుంకరమెట్ట పంచాయతీలో మూడు నెలలుగా రేషన్ ఇవ్వడం లేదని, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతున్నదని సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు మాట్లాడుతూ మండలంలోని ఏడు గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమోన్నత పాఠశాలల్లో సుమారు 900 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. పలు శాఖలపై ప్రతీ సమావేశంలో తెలుపుతున్నా ఫలితం లేదని వాపోయారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు.


సభ్యులు లేవనెత్తిన సమస్యలకు వివరణ ఇస్తున్న ఎంపీడీవో వెంకటేష్... హాజరైన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు

మంత్రి సంధ్యారాణిని కలిసిన టీడీపీ నాయకులు

పాడేరు రూరల్, జూన్ 19: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని తెలుగు యువత రాష్ట్ర క్యానిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్‌తో పాటు నియోజకవర్గ నాయకులు బుధవారం సాలూరులో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. అనంతరం పాడేరు నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పాడేరులో టీడీపీ అభ్యర్థిని ఈశ్వరి ఓటమికి గల కారణాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో కె.కృష్ణారావు, సోమేష్, సాయి, వెంకటప్రసాద్, మూర్తిబాబు, చంటిబాబు ఉన్నారు.


మంత్రి సంధ్యారాతో పాడేరు టీడీపీ నాయకులు

'పల్లా'ను కలిసిన శ్రావణ్‌కుమార్

అరకులోయ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మాజీ మంత్రి, అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అతనికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అలాగే అరక పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ కార్యకలాపాలను పల్లాకు వివరించారు.



సీజీఆర్ఎఫ్ సేవలపై విద్యార్థులకు అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సత్యనారాయణ

చింతపల్లి, జూన్ 19: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులోఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై కోర్టుకు వెళ్లకుండా సీజీఆర్ఎఫ్ ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. వినియోగదారులు 1912 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి సమస్యలను తెలిపితే, 24 గంటల్లో పరిష్కరించనున్నట్టు చెప్పారు. లేనిపక్షంలో రోజుకు రూ.200 చొప్పున వినియోగదారుడు ఖాతాకు జమ చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. 2005 నుంచి ఇప్పటివరకు 7,866 సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. బాధితులకు రూ.5.55 లక్షలు పరిహారం అందించినట్టు చెప్పారు. మరో 139 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ సాయిబాబా, పాడేరు డీఈ అప్పారావు, చింతపల్లి ఏడీఈ సూర్యప్రకాశ్, ఏఈఈలు ప్రభాకరరావు, ఎంవీ రమణ, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరి విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా

... 3వ పేజీ తరువాయి

మొక్కుబడిగా అమలవుతున్నది. విద్యార్థులకు ఆరోగ్యం బాగోలేకపోతే ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యం అందిస్తున్నారే గాని, వైద్యులు విద్యాలయాలకు వెళ్లి సేవలు అందిస్తున్న ఘైనాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం గురించి పట్టించుకున్న నాథుడే లేని దుస్థితి కొనసాగుతున్నది. దీంతో గిరిజన విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు సర్వసాధారణమైపోయాయి. అలాగే వైద్య ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం ఏడాదిలో రెండు మార్లు మాత్రమే పాఠశాలలో విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తారు. ఇందులో భాగంగా వైద్యులు, సిబ్బంది తమకు అందుబాటులో ఉన్న పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో మిలిగిన సమయాల్లో విద్యార్థుల ఆరోగ్యం గురించి పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఏజెన్సీలో కస్తూర్బా బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రత్యేక వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ, ఆశ్రమాల్లో అందుకు భిన్నమైన పరిస్థితి ఇన్నాళ్లుగా కొనసాగుతున్నది.

విద్యార్థుల ఆరోగ్య రక్షణ చర్యలివి..

ప్రతి ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వలంటీర్‌ను నియమించాలి.

ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించాలి.

అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అంబులెన్సు సమకూర్చాలి.

స్కూల్ హెల్త్ కార్యక్రమానికి ప్రత్యేకంగా వైద్యులను నియమించాలి.

మండల స్థాయిలో విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై మండల ప్రత్యేకాధికారి, ఏటీడబ్ల్యూవోల పర్యవేక్షణ కొనసాగాలి.

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించండి

» పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టు, జూన్ 19: సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సకాలంలో అవసరమైన వైద్య సేవలను అందించాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీని బుధవారం సందర్శించి సికిల్ సెల్ ఎనీమియా స్ర్కీనింగ్ పరీక్షలను పరిశీలించారు. మందుల అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా? లేవా? అని అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో తిరిగి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పీవో మాట్లాడుతూ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. స్థానిక సీహెచ్‌సీ 16 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించగా, మూడు పాజిటివ్ వచ్చాయని చెప్పారు. సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆ వ్యాధి వారసత్వంగా సంక్రమిస్తుందని, ప్రతీ ఒక్కరూ ఆ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అలాగే మలేరియా ప్రభావిత ప్రాంతాలలో ముందుగా దోమల నివారణ మందును పిచికారీ చేయించడం జరుగుతుందని, ప్రతీ ఒక్కరూ ఇంటిలోపల బయట మందును పిచికారీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న పీవో అభిషేక్

టీచర్ పోస్టుల భర్తీకి ఆర్డినెన్స్ తేవాలి

» గిరి యువత కోసం స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి

» గిరిజన సంఘం రాష్ట్ర ప్రతినిధులు

పాడేరు రూరల్, జూన్ 19: స్పెషల్ డీఎస్సీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని నిరుద్యోగులతో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు తక్షణమే ఆర్డినెన్స్ తీసుకురావాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సంఘం సభ్యులు పి.అప్పలనర్స ఆధ్వర్యంలో బుధవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి సాలూరులో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో అప్పలనర్స మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మొదటి సంతకం చేసి ఎన్నికల హామీని నెరవేర్చుకోవడం హర్షణీయమన్నారు. కాని ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో శతశాతం పోస్టుల భర్తీకి రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వకపోవడంతో గిరిజన నిరుద్యోగ యువతలో ఆందోళన వ్యక్తమవుతున్నదన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు పునఃపరిశీలన చేయాలని ఆయన కోరారు. అలాగే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాల నివారణకు ఏఎన్ఎంలను నియమించాలని, ఆదివాసీ మాతృ బాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని మంత్రి సంధ్యారాణిని కోరగా, సానుకూలంగా స్పందించారని అప్పలనర్స తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, జిల్లా గౌరవాధ్యక్షుడు సీదరపు అప్పారావు, ఆదివాసీ మాతృ భాష విద్యా వలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకులు మర్రి చిట్టిబాబు, వెంకటేష్, ఆనంద్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘం ప్రతినిధులు

వ్యాధుల విజృంభణ

... 3వ పేజీ తరువాయి

ఉన్నది. రోగులకు చికిత్స అందించేందుకు ఈ భవనం సరిపోవడం లేదు. నలుగురు వైద్యాధికారులు సైతం ఒకే గదిలో కూర్చొని చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగులు ఆస్పత్రిలో కూర్చోవడానికి స్థలం లేకుండాపోయింది. వంద పడకల ఆస్పత్రి భవనం నిర్మాణ పనులు గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికి కేవలం 30 శాతమే పూర్తయ్యాయి. ఈ నూతన భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో స్పష్టత లేదు. దీంతో రోగులు, వైద్యులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రికి రోగుల తాకిడి పెరగడంతో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

లబ్బూరు పాఠశాలలో దోమల మందు స్ప్రేయింగ్

ముంచంగిపుట్టు, జూన్ 19: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో బుధవారం మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేశారు. తరగతి, వసతి గదులు, వంటశాలల లోపల బయట స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మలేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధులు బారిన పడకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ ప్రదీప్, భీమరాజు పాల్గొన్నారు.

సుండ్రుపుట్టులో 50 మందికి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

పాడేరు రూరల్, జూన్ 19: సుండుపుట్టు అంగన్‌వాడీ కేంద్రం వద్ద 50 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేశారు. గ్రామంలోని రెండు నుంచి 45 ఏళ్ల వయస్సుగల వారికి అంగన్‌వాడీ కార్యకర్త కేంద్రం వద్దకు రప్పించి వైద్య సిబ్బందితో పరీక్షలను చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్, సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

... 3వ పేజీ తరువాయి

వస్తాయి. రోజుకు సుమారు రూ.2 లక్షల బిల్లు, నెలకు రూ.60 లక్షలు, ఏడాదికి రూ.7.2 కోట్ల బిల్లు వచ్చే కాంట్రాక్టు కావడంతో చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ నేత కన్ను పడింది. కలెక్టరేట్‌లో కాలు పెట్టారు. ఉన్నతాధికారి సంతకం చేయడంతో రెండేళ్లకు డైట్ కాంట్రాక్టు దక్కించుకున్నారు. దానిని నలుగురు అనుచరులకు పంచిపెట్టారు. ఆరు నెలలకు ఒకరు చొప్పున డైట్ కాంట్రాక్ట్ తీసుకొని ఆహారం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నైకు చెందిన ఒక వ్యక్తి డైట్ అందిస్తున్నారు. ఇందులో భారీగా లాభం కళ్ల చూడాలనే ఆశతో రోగులకు సరైన ఆహారం అందించడం లేదు. వారికి ఏది తయారుచేయడం సులువో చూసుకొని అది మాత్రమే పెడుతున్నారు. ఈ కాంట్రాక్టు వెనుక ఎవరు ఉన్నారో అందరికీ తెలిసిన విషయమే కావడంతో కేజీహెచ్ పరిపాలనా అధికారులు పట్టించుకోవడం లేదు. కడుపు మండి ఎవరైనా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే...అది బుట్టదాఖలు అవుతున్నదే తప్ప చర్యలు ఉండడం లేదు.

ప్లేటులో వేస్తే చెదిరిపోయే ఉప్మా

రోగులకు ప్రతిరోజూ ఉదయం టిఫిన్ కింద ఇడ్లీ/ఉప్మా/కిచిడీ/బ్రెడ్‌లలో ఏదో ఒకటి, పాలు, గుడ్డు ఇవ్వాలి. అయితే ఇడ్లీలు తయారుచేసే యంత్రం పాడైపోయిందని అవి పెట్టడం మానేశారు. పోనీ ఆ స్థానంలో మంచి టిఫిన్ ఏదైనా ఇస్తున్నారా?...అంటే అదీ లేదు. గత పది రోజులుగా టిఫిన్ ప్లేటులో ఉప్మాయే పోస్తున్నారు. గరిటెతో తీసి ప్లేటులో వేయగానే అది ప్లేటు అంతా సాంబారులా పరుచుకుపోతోంది. దానిని ఉప్మా అంటారో...లేదా కొత్తగా ఏమైనా పేరు పెట్టాలో అర్థం కాదు. కిచిడీ కూడా ఇవ్వడం లేదు. ప్రతి ఆహారం ఎంత బరువుతో ఇవ్వాలో లెక్కలు ఉన్నాయి. వాటిని పాటించే దిక్కే లేదు. మధ్యాహ్న భోజనం కింద అన్నం, సాంబారు, పప్పు, కూర, మజ్జిగ, అరటిపండు, గుడ్డు ఇవ్వాలి. రాత్రికి మజ్జిగ, అరటిపండు తీసేసి మిగిలినవన్నీ ఇవ్వాలి. ఎవరైనా రోగులు పుల్కాలు, రోటీ అడిగితే పెట్టాలి. మూడు పూటలూ గుడ్డు అందించాలి. ఈ భోజనంలో కూరలు, పప్పు గురించి చెప్పనక్కర్లేదు. ఆహారం రోగులకు సాయంగా ఉండేవారు తిని, బయట నుంచి మంచి ఆహారం తీసుకువచ్చి రోగులకు పెడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

☛ సంక్షిప్తంగా..

నిల్వ పదార్థాలు విక్రయిస్తే చర్యలు

» జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్

ముంచంగిపుట్టు, జూన్ 19: నిల్వ చేసిన ఆహార పదర్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అల్లూరి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బి.వేణుగోపాల్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు హోటళ్లు, టీ దుకాణాలు, సమోసా, జిలేబీ షాపులను బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, గుర్తింపులేని ఫుడ్ కలర్స్‌ను వాడరాదని, శుభ్రత పాటించాలని వ్యాపారులకు ఆయన సూచించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యాపారులతో సమావేశమయ్యారు. ఆహార పదార్థాల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఆరు దుకాణాల్లో ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించామన్నారు. కొన్ని దుకాణాల్లో ఫుడ్ కలర్స్‌ను వాడుతున్నట్టు గుర్తించి, వారికి నోటీసులు జారీ చేశామని చెప్పారు. అలాగే సమోసా, జిలేబీ దుకాణాలతో పాటు పలు హోటళ్లలో ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. వాటిలో లోటుపాట్లు ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత వ్యాపారులపై చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

కూటమి నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం రేపు: గిడ్డి ఈశ్వరి

పాడేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న పాడేరులో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన కూటమి నేతలు, ముఖ్యమైన కార్యకర్తలు విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని గిడ్డి ఈశ్వరి కోరారు.

దూర విద్య ఫీజులు చెల్లించాలి

పాడేరు రూరల్, జూన్ 19: ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్యా కేంద్ర ద్వితీయ, తృతీయ సంవత్సర పరీక్షల ఫీజును చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టిబ్బాయి తెలిపారు. వచ్చే నెల 30వ తేదీ నుంచి పరీక్షలు జరుగుతాయని, ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజులను చెల్లించాలని సూచించారు.

వైద్య సిబ్బంది వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన

పాడేరు రూరల్, జూన్ 19: పాడేరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి బకాయిపడ్డ నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జల్లి రాజుబాబు, కోకన్వీనర్ విలేకరులతో మాట్లాడుతూ వైద్య సిబ్బందికి వేతనాలు చెల్లించకుండా విధులను చేయిస్తూ నాలుగు నెలలుగా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 88 మంది వైద్య సిబ్బందిని డీఎంఈ పరిధిలోకి తీసుకు రావాలని, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బంది వేతన చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే భవిష్యత్‌లో వైద్య సిబ్బందితో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది అప్పలస్వామి, గణేష్, ఎలీషా, సూర్య, రాంబాబు, అప్పారావు, సత్యనారాయణ, రత్నకుమారి, శేష తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆహార పదార్థాల విక్రయదారులపై చర్యలు

పాడేరు రూరల్, జూన్ 19: జిల్లాలోని వివిధ మండలాల్లో నాణ్యత ప్రమాణాలు, తూనికలు, కొలతలు పాటించని ఆహార పదార్థాల అమ్మకందారులపై చర్యలు చేపట్టాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బి.చిట్టిబాబు, రమేష్ కోరారు. బుధవారం జిల్లా ఆహార భద్రతాధికారి వేనుగోపాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వ్యాపారులు నాణ్యతాప్రమాణాలు, తూనికలు, కొలతలు పాటించడం లేదన్నారు.

ధరలు, గడువు తేదీ, తయారీ తేదీలు లేని వస్తువులను ఎక్కువ మంది వ్యాపారులు అమ్మకాలు చేపట్టి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. మెడికల్ షాపుల విషయానికి వస్తే స్ట్రిప్‌పై ఉన్న ధర కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారని, విడివిడిగా మందులు అమ్మకాలు చేపట్టి వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని వివరించారు. ఈ విషయంపై అధికారులు ఆకస్మిక తనిఖీలను చేపట్టాలని, రిజిస్ట్రేషన్ సైతం లేకుండా వ్యాపారాలను నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరామన్నారు. ఫిర్యాదుపై స్పందించిన ఆహార భద్రతాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ హెచ్చరికలు జారీ చేసినా వినని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని, తనిఖీల్లో దొరికి రుజువైతే గుర్తింపు రద్దు చేయడంతో పాటు షాపు మూసివేత, సుమోటోగా కేసులు నమోదు చేసి శిక్ష పడేలా చూస్తున్నామన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు బాలరాజు, తిరుపతి, లోహిదాసు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

కొయ్యూరు, జూన్ 19: విద్యార్థులు పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సత్యనారాయణ కోరారు. బుధవారం శరభన్నపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీటీసీ సభ్యుడు సోమగాంధీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో పుస్తకాలను పంపిణీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట కుమారి, ఉప సర్పంచ్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

సీలేరు రోడ్డు సమస్య పరిష్కరించాలి

సీలేరు, జూన్ 19: గూడెంకొత్తవీధి-సీలేరు అంతర్రాష్ట్ర సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరావుకు ఫిర్యాదు చేసినట్టు భారత ఆదివాసీ గిరిజన సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గడుతూరి రామ్‌గోపాల్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా ధారాలమ్మ ఘాట్ రోడ్డు' అన్న శీర్షికన ప్రచురితమైన కథనం ఆధారంగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌కు లేఖలు రాశారని గడుతూరి రామ్‌గోపాల్ తెలిపారు. అయితే జిల్లా కలెక్టర్‌కు, పాడేరు ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు చర్యలు తీసుకోవాలంటూ ఆయన లేఖలు పంపారు.